ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

# కరీంనగర్

రాజన్న సిరిసిల్ల , జగిత్యాల, పెద్దపల్లి

సోమవారం 05 అక్టోబర్ 2026



## వేములవాడలో కబడ్డీ పండుగ



- క్యాంప్ ఫైర్‌లో మెరిసిన ప్రభుత్వ విప్
- క్రీడాకారులతో కలిసి చిందులేసిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు

వివరాలు 5లో..



# బెల్ట్ దందాలో పల్లెలు...!

- విచ్చలవిడిగా అక్రమ మద్యం అమ్మకాలు
- అధిక ధరలకు విక్రయాలు.
- ప్రధాన రహదారుల నుంచి పల్లె వీధుల వరకు విస్తరించిన బెల్ట్ షాపుల వ్యవహారం
- నిబంధనలు ఉన్నా పట్టించుకునేవారేరీ?
- ఎక్సైజ్ అధికారులు నిఘా పెంచాలంటున్న గ్రామస్థులు

గ్రామాల్లో మద్యం విక్రయాల నియంత్రణకు నిబంధనలు ఉన్నప్పటికీ.. బెల్ట్ షాపుల రూపంలో మద్యం అందుబాటులోకి వస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కిరాణా దుకాణాలు, ఇతర వ్యాపార సముదాయాల మాటున గుట్టుచప్పుడు కాకుండా మద్యం విక్రయాలు సాగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి.

వివరాలు 2లో..

## కొండయ్యపల్లి సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై తీవ్ర ఆరోపణలు
- రాజకీయ కక్షసాధింపులే కారణమని ఆవేదన
- సర్పంచుల ఫోరం గ్రూప్‌లో అవహేళన
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లేఖ



వివరాలు 4లో..

## మద్యం మత్తులో వ్యక్తిపై బీరు సీసాతో దాడి

- గ్రామాలలో బెల్ట్ షాపుల విచ్చలవిడి జోరు
- రేకొండ గ్రామంలో యువకుడి తల పగలగొట్టిన వ్యక్తి
- అధికారుల నిర్లక్ష్య వైఖరిపై గ్రామస్థుల ఆగ్రహం
- ఎక్సైజ్, పోలీస్ శాఖల పర్యవేక్షణ కరవు



9లో



# బెల్ట్ దందాలో పల్లెలు...!

## గ్రామాల్లో జోరుగా మద్యం విక్రయాలు

**గ్రామాల్లో మద్యం విక్రయాల నియంత్రణకు నిబంధనలు ఉన్నప్పటికీ.. బెల్ట్ షాపుల రూపంలో మద్యం అందుబాటులోకి వస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కిరాణా దుకాణాలు, ఇతర వ్యాపార సముదాయాల మాటున గుట్టుచప్పుడు కాకుండా మద్యం విక్రయాలు సాగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. రామడుగు మండల పరిధిలోని 23 గ్రామపంచాయతీల్లోనూ పరిస్థితిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. అధికారిక జిల్లా సమాచారం ప్రకారం రామడుగు మండల పరిషత్ పరిధిలో 23 గ్రామపంచాయతీలు ఉన్నాయి.**

**రామడుగు, అక్టోబర్ 04 (ప్రజా జ్యోతి)**

- **విచ్చలవిడిగా అక్రమ మద్యం అమ్మకాలు**
- **అధిక ధరలకు విక్రయాలు.**
- **ప్రధాన రహదారుల నుంచి పల్లె వీధుల వరకు విస్తరించిన బెల్ట్ షాపుల వ్యవహారం**
- **నిబంధనలు ఉన్నా పట్టించుకునేవారేరీ?**
- **ఎక్సైజ్ అధికారులు నిఘా పెంచాలంటున్న గ్రామస్థులు**

### ప్రధాన గ్రామాల్లోనే జోరుగా.. గుట్టుచప్పుడు కాకుండా

మద్యం దుకాణాలకు నిర్ణీత సమయాలు, అనుమతులు, విక్రయ నిబంధనలు ఉన్నప్పటికీ.. వాటికి వెలుపల కూడా మద్యం లభిస్తోందని పలువురు గ్రామస్థులు చెబుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లోనే కాకుండా రాత్రి సమయాల్లోనూ కొన్ని ప్రాంతాల్లో మద్యం అందుబాటులో ఉంటోందన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో గ్రామాల్లో మద్యం వినియోగం పెరుగుతోందని, కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ...?

బెల్ట్ షాపుల వ్యవహారంపై ఎక్సైజ్ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో నిఘా మరింత పెంచాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. అనుమతులు లేని ప్రదేశాల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయా? మద్యం



దుకాణాల నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా సరఫరా జరుగుతోందా? నిర్ణీత ధరల కంటే అధికంగా విక్రయిస్తున్నారా? అనే అంశాలపై అధికారులు తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు.

### అధిక ధరలకు విక్రయాలు.. అదనపు భారం

బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తే సాధారణ ధరల కంటే అధిక ధరలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అత్యవసరంగా మద్యం కావాల్సిన పరిస్థితుల్లో వినియోగదారులు అడిగిన ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందని పలువురు చెబుతున్నారు. దీనిపై అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి వాస్తవ పరిస్థితిని వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

### యువతపై ప్రభావం.. కుటుంబాల్లో ఆందోళన

గ్రామాల్లో మద్యం సులభంగా అందుబాటులోకి రావడం వల్ల యువతపై ప్రభావం పడుతోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ కూలీలు, చిన్న వ్యాపారులు సంపాదించిన ఆదాయంలో కొంత భాగం మద్యానికే ఖర్చు చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని వారు చెబుతున్నారు. దీనివల్ల కుటుంబ అవసరాలకు డబ్బు కొరత ఏర్పడటంతో పాటు, కుటుంబ కలహాలకు కూడా దారితీస్తోందని పలువురు పేర్కొంటున్నారు.

### నిఘా పెంచితేనే అక్రమాలకు అడ్డుకట్ట

బెల్ట్ షాపులపై ఆరోపణలు వస్తున్న ప్రాంతాలను గుర్తించి ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. మద్యం విక్రయాలకు అనుమతి లేని దుకాణాలపై తనిఖీలు నిర్వహించడంతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణలో అనధికార మద్యం విక్రయ కేంద్రాలపై చర్యలు, బెల్ట్ షాపుల నియంత్రణ అంశం గతంలోనూ ప్రజా చర్చకు వచ్చిన విషయం తెలిసిందే.

### అధికారుల తనిఖీలతోనే వాస్తవాలు వెలుగులోకి!

రామడుగు మండలంలోని 23 గ్రామపంచాయతీల పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తే బెల్ట్ షాపులపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవమెంత? అనేది స్పష్టమవుతుందని గ్రామస్థులు అంటున్నారు. అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న కేంద్రాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న శఠకోప రామానుజ జియర్ స్వామి

**బీర్ పూర్, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** తమిళనాడు శ్రీవిల్లిపుత్తూర్ స్వామి మానవాళ మాముని సన్నిధి 23వ పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ శఠకోప రామానుజ జియర్ స్వామి వారు ఆదివారం బీర్ పూర్ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన జియర్ స్వామి వారికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వామివారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు మంగళాశాసనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ డి. కిరణ్, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ చీర్నెని శ్రీనివాస్, సభ్యులు మల్లేశం, సురేందర్, ఉపసర్పంచ్ ఎనగంటి జితేందర్, అర్చకులు పాల్గొన్నారు.







## క్రీడాకారులకు ఎనర్జీ డ్రింక్స్ అందజేసిన మున్సిపల్ చైర్మన్

**వేములవాడ, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):**
ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు మూడో రోజు అత్యంత ఉత్సాహభరితంగా కొనసాగాయి. ఈ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారుల కోసం రాజన్న ఫార్మసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎనర్జీ డ్రింక్స్‌ను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటగాళ్లకు శక్తిని అందించేందుకు ముందుకు వచ్చిన రాజన్న ఫార్మసీ యాజమాన్యాన్ని అభినందించారు. క్రీడాకారులు ఎంతో ఉత్సాహంతో పోటీపడుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వకుళభరణం శ్రీనివాస్, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై ప్రశాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొలనూరు సింగిల్ విండో చైర్మన్‌కు సన్మానం



**కోనరావుపేట, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):**
కొలనూరు సింగిల్ విండో సహకార సంఘం నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బొమ్మన భాస్కర్‌రావును ఆదివారం గ్రామంలో రైతు కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి సహకార సంఘం ద్వారా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అప్పల నాగభూషణం, రైతు కమిటీ అధ్యక్షుడు భూమయ్య, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

**కోనరావుపేట, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):**
కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన అవధూత సుమన్ (39) అనారోగ్య కారణాలతో మనస్థాపానికి గురై ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమన్‌కు 14 ఏళ్ల క్రితం వివాహమైనా సంతానం కలగలేదు. దీనికి తోడు గత కొంతకాలంగా కడుపునొప్పి, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. చికిత్స పొందినా నయం కాకపోవడంతో తీవ్ర మనస్థాపం చెంది శనివారం ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి అన్న అవధూత శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎస్సై బి. రామ్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# మున్సిపల్ కార్మికులకు ఘన సన్మానం

**వేములవాడ, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):**
ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజును పురస్కరించుకుని సేవా పక్షోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక పద్మశాలి సంఘంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి సంటి మహేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహేష్, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, ప్రతాప రామకృష్ణ మాట్లాడారు. రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు క్రాంతి కుమార్ ఆదేశాల మేరకు వేములవాడను స్వచ్ఛభారత్‌లో ముందంజలో ఉంచుతున్న కార్మికులను గౌరవించుకోవడం అభినందనీయమన్నారు. మోడీ పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 17 వరకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కుమ్మరి శంకర్, సీనియర్ నాయకులు సంటి అంజిబాబు, చిక్కుడు మల్లేశం, కటకం శ్రీనివాస్, సగ్గు రాహుల్, బుర్ర మనీష్ తదితరులు పాల్గొన్నారు.



# కనగర్తి వెలుగుల బాట

## రూ.2.70 కోట్లతో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్

- టీజీఎన్‌పీడీసీఎల్ నుంచి పరిపాలనా, సాంకేతిక అనుమతులు మంజూరు
- తీరనున్న విద్యుత్ ఇబ్బందులు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ప్రజాప్రతినిధుల కృతజ్ఞతలు



NORTHERN POWER DISTRIBUTION COMPANY OF TELANGANA LIMITED
CORPORATE OFFICE : WARANGAL

**ABSTRACT**

TGNPDCL/WGL – Proposal for erection of 33/11KV Substation at **Kanagarthy (V)** in Konaraopet (M) of Vemulawada Division of Operation Circle Rajanna Siricilla - Administrative Approval and Technical Sanction under T&D – Orders issued.

**N.O.O (CE/Projects) Ms.No.605** **Dt.03.10.2026.**

Read the following: -

(1) N.O.O. Cs Ms.No.461, Dt: 07.01.2013.

**ORDER:**

1. It is reported from the field that the consumers of Kanagarthy are getting more number of interruptions due to lengthy loaded feeders because of increasing in loads, day to day demand and loads are increasing day by day.
2. In view of the above, it is proposed for erection of 33/11KV Substation at Kanagarthy (V) in Konaraopet (M) of Vemulawada Division of Operation Circle Rajanna Siricilla with a provision of 1x5.0MVA Power transformer and **3 Nos.** 11KV feeders namely Kanagarthy, Gollapally and Express feeders.
3. After careful consideration, TGNPDCL accords administrative approval and technical Sanction for the above proposal for erection of 33/11KV Substation at Kanagarthy (V) in Konaraopet (M) of Vemulawada Division of Operation Circle Rajanna Siricilla for an amount of **Rs.2,70,81,000/-** (Rupees Two Crores Seventy Lakhs Eighty One Thousand only).
4. The proposal envisages the following:

| Sl. No. | Name of the proposed 33/11KV Substation | Mandal | Constituency/ Division/ Circle/ District | Sub station (Nos.) | Proposed 33KV line (KM) (In & Out) | Proposed 11 KV line (KM) | Switch yard and civil (Rs. In Lakhs) | 33KV line (Rs. in Lakhs) | 11KV line (Rs. in Lakhs) | Cost of the Substation (Rs.in Lakhs) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | Kanagarthy | Konaraopet | Vemulawada/ Vemulawada/ Rajanna Siricilla/ Rajanna Siricilla | 1 | 4.50 | 2.50 | 202.00 | 51.51 | 17.31 | 270.81 |
| | | | | | | | | | **Total** | **270.81** |

Contd.

AnyScanner

: 2 :

5. The expenditure is chargeable to T&D/S.I Account.
6. This order issued with the concurrence of Director/Finance/TGNPDCL.

**(BY ORDER AND IN THE NAME OF TGNPDCL/WARANGAL)**

Sd/-
KARNATI VARUN REDDY, IAS
CHAIRMAN AND MANAGING DIRECTOR

**కోనరావుపేట, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):**
కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి నూతన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైంది. రూ. 2 కోట్ల 70 లక్షల 81 వేల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ సబ్‌స్టేషన్‌కు సంబంధించి తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎన్‌పీడీసీఎల్) పరిపాలనా, సాంకేతిక అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కనగర్తి సహా పరిసర గ్రామాల్లో వినియోగం పెరగడం, సుదీర్ఘ ఫీడర్ల వల్ల తరచూ తలెత్తుతున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో ఈ నిధులు సాధించారు. ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే లో-వోల్టేజ్ సమస్యలు తొలగి గృహ, వ్యవసాయ రంగాలకి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందనుంది. సబ్‌స్టేషన్ మంజూరుకు కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మానుక సత్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, సింగిల్ విండో చైర్మన్లు బొమ్మెన భాస్కరరావు, చేపూరి గంగాధర్ గుప్తా తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామీణ క్రీడా ప్రావీణ్యానికి వేములవాడ వేదిక: విప్ ఆది శ్రీనివాస్

- రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారులకు వసతి, భోజన వసతుల్లో లోటులేకుండా పర్యవేక్షణ
- తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న వేములవాడ ఎమ్మెల్యే

**వేములవాడ, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):**
గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాల్లాంటి క్రీడాకారులను ప్రోత్సహించడమే తమ ప్రధాన లక్ష్యమని, వేములవాడలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విచ్చేసిన క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం వేములవాడలో నిర్వహించిన తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ప్రత్యేక జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల నిర్వహణకు ఆతిథ్యమిచ్చే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులను అతిథులుగా కాకుండా కుటుంబ సభ్యులుగా భావించి కళ్యాణ మండపాల్లో వసతితో పాటు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. సామాన్య కుటుంబాల నుంచి వచ్చి క్రీడల్లో రాణిస్తున్న ప్రతిభావంతులకు సరైన అవకాశాలు కల్పించి, వారు జాతీయ స్థాయిలో మెరిసేలా సహకారం అందిస్తామని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.





# బీసీ నేతల ప్రశ్నలకు దాడులే సమాధానమా..?

- ఆహ్వానాలపై ప్రశ్నించినందుకు సమావేశంలో గొడవ
- పలువురిపై దాడి చేసి గాయపరచడం దారుణం
- బీఆర్ఎస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కడ ఉంది?
- దాడులకు మాజీ ఎమ్మెల్యే బాధ్యత వహించాలి



**పెద్దపల్లి, అక్టోబర్ 04 (ప్రజాజ్యోతి):** బీసీ కార్యకర్తల సమావేశానికి కొందరు బీసీ నాయకులను ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించినందుకు సమావేశంలో గొడవ జరగడం, ప్రశ్నించిన పలువురిపై దాడి చేసి గాయపరచడం బీఆర్ఎస్‌లో నెలకొన్న అంతర్గత పరిస్థితులకు అద్దం పడుతోందని మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ బీసీ నాయకుడు గంట రాములు యాదవ్ ఆరోపించారు. ప్రజా సమస్యలు, పార్టీ వ్యవహారాలపై ప్రశ్నించే హక్కు కూడా లేకుండా చేయడం సరికాదని, దాడుల సంస్కృతిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

**సమావేశంలో వివాదం**

శనివారం పెద్దపల్లిలోని ఆర్ఆర్ గార్డెన్‌లో జరిగిన బీఆర్ఎస్ బీసీ కార్యకర్తల సమావేశంలో బీసీ నాయకులు గంట రాములు యాదవ్, చిరుమల రాకేష్, దాసరి ఉషలను సమావేశానికి ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించడంతో వివాదం తలెత్తినట్లు ఆయన తెలిపారు. ఈ విషయంపై నిలదీసిన పలువురిపై దాడి చేసి గాయపరిచారని తీవ్రంగా ఆరోపించారు.

**బిసి నాయకత్వాన్ని అణచివేసే కుట్ర**

ఈ ఘటనను ఖండిస్తూ ఆదివారం పెద్దపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గంట రాములు యాదవ్ మాట్లాడారు. బీసీ నాయకత్వాన్ని అణచివేసే ధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. బీఆర్ఎస్ పార్టీ పేరుతో కొందరు వ్యక్తులు దాడులకు పాల్పడటం బాధాకరమని పేర్కొన్నారు. ఉద్యమ నేపథ్యం కలిగిన బీఆర్ఎస్‌లో దాడులు చేసే సంస్కృతి లేదని, పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందన్నారు.

**సొంత పార్టీ వారిపైనే దాడులా?**

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించాల్సిన సమయంలో వాటిపై ఎందుకు మాట్లాడటం లేదని రాములు యాదవ్ ప్రశ్నించారు. అధికారపక్షం నాయకులపై విమర్శలు వస్తున్నప్పుడు స్పందించకుండా సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలపైనే దాడులకు పాల్పడటం ఎందుకని నిలదీశారు. స్థానిక ఎమ్మెల్యే చేపడుతున్న కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

**మాజీ ఎమ్మెల్యే బాధ్యత వహించాలి**

తాను 25 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్నానని, కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ గొడుగు కింద పనిచేస్తున్నానని గంట రాములు యాదవ్ తెలిపారు. పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా వారి గెలుపు కోసం పనిచేస్తానని, కేసీఆర్ నాయకత్వాన్ని బలోపేతం చేయడమే తన లక్ష్యమని అన్నారు. తాను ఎమ్మెల్యే కావాలని కొందరు కోరుకోవడంలో తప్పేమీ లేదని, అయితే తనకు ప్రజల్లో ఆదరణ పెరగడం కొందరికి నచ్చడం లేదని ఆరోపించారు.

తనపై, తమ వర్గీయులపై భౌతిక దాడులకు పాల్పడటం ద్వారా రాజకీయంగా అణచివేయాలని చూస్తున్నారని ఆరోపించిన గంట రాములు యాదవ్.. ఈ ఘటనకు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# కొండయ్యపల్లి సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై తీవ్ర ఆరోపణలు
- రాజకీయ కక్షసాధింపులే కారణమని ఆవేదన
- సర్పంచుల ఫోరం గ్రూప్‌లో అవహేళన
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లేఖ



**గంగాధర, అక్టోబర్ 04 (ప్రజాజ్యోతి):** గంగాధర మండలం కొండయ్యపల్లి గ్రామ సర్పంచ్ మల్యాల తిరుపతి (వినయ్ సాగర్) ఆదివారం ఉదయం స్థానిక మధుర నగర్ ఎక్స్ రోడ్డు అంబేద్కర్ చౌరస్తాలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తనపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేసిన కొద్దిసేపటికే ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం నియోజకవర్గంలో మరియు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. హుటాహుటిన మల్యాల తిరుపతిని కుటుంబీకులు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**ఎమ్మెల్యే సత్యం వేధింపులే కారణమంటూ ఆరోపణలు**

కొండయ్యపల్లి గ్రామ అభివృద్ధి పనులు మరియు స్థానిక రాజకీయాల విషయంలో చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తనపై కక్షగట్టారని, కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్నారని సర్పంచ్ తిరుపతి ఆరోపించారు. అక్రమ కేసులు పెడుతున్నారని, గంజాయి కేసులు పెడతామని బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి గురించి అడిగితే ఇబ్బందులకు గురిచేస్తున్నారని తిరుపతి వాపోయారు.

**ఆత్మహత్యకు వారే కారణమంటూ లేఖ**

అధికార పార్టీకి చెందిన సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ముద్దాం నగేష్, ఎట్టపు కనకయ్య వాట్సాప్ గ్రూప్‌లో అవహేళన చేసి, కులం పేరుతో వేధింపులకు గురిచేయడం భరించలేకే తాను ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన ఆత్మహత్యాయత్నానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఉప్పర మల్యాల సర్పంచ్ ముద్దం నగేష్, చర్లపల్లి (ఆర్) సర్పంచ్ ఎట్టపు కనకయ్యలే కారణమంటూ లేఖ రాసి మల్యాల తిరుపతి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు.

**పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సుంకే**

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మల్యాల తిరుపతిని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ పరామర్శించారు. అభివృద్ధి గురించి ప్రశ్నిస్తే ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సర్పంచులను ఇలా ఇబ్బందులకు గురిచేయడం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. బాధితుడు మల్యాల తిరుపతికి అన్ని విధాలా అండగా ఉంటానని ఈ సందర్భంగా సుంకే రవిశంకర్ హామీ ఇచ్చారు.

# క్రీడలతోనే మానసిక ఉల్లాసం, దేహదారుఢ్యం

**ప్రభుత్వ విప్ విజయరమణ రావు**

- ఘనంగా 70వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి కరాటే ఎంపిక పోటీలు
- విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తేలాలని పిలుపు



పెద్దపల్లి, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి): చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పిలుపునిచ్చారు. దేహదారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్స్‌లో నిర్వహించిన 70వ ఎస్‌జీఎఫ్ (గా+ఫీ) జిల్లా స్థాయి అండర్-11, అండర్-14 బాలురు, బాలికల కరాటే ఎంపిక పోటీలను ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయరమణ రావు మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడలు, క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మన ప్రాంత విద్యార్థులు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటి పెద్దపల్లి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు తన వంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్‌లు, క్రీడాకారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.



## రిటైర్డ్ ఉద్యోగి రాజలింగం మృతి..

**పద్మశాలి సంఘం పరామర్శ**

ముత్తారం, సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి): తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల కోటేశం తండ్రి, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి పరికిపండ్ల రాజలింగం (85) అనారోగ్యంతో ముత్తారంలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న పద్మశాలి ఉద్యోగ సంఘం నాయకులు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. రాజలింగం మృతి పట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ఫోన్ ద్వారా కోటేశంకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు కొలిపాక సారయ్య ఆధ్వర్యంలో నాయకులు రాజలింగం పార్థివదేహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డా. దుబాసి విష్ణుమూర్తి, నాయకులు కొలిపాక నగేష్, తాటికొండ వెంకటేశ్వర్లు, అనుమాండ్ల రాజశేఖర్, బూర్ల రాజేందర్, రంగు రవి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో గంజాయి కలకలం: కొలనూరు వాసి అరెస్ట్





- తనిఖీలు చేపట్టి మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్సై నరేష్ వెల్లడి

పెద్దపల్లి, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి): పెద్దపల్లి పట్టణంలో గంజాయి పట్టుబడటం తీవ్ర కలకలం రేపింది. ఓదెల మండలం కొలనూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పట్టణంలో గంజాయి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నాడనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పట్టణంలో గంజాయి విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, ముఖ్యంగా యువత గంజాయికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.




## కట్న వేధింపుల కేసులో భర్త అరెస్ట్

కోనరావుపేట, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి): అదనపు కట్న వేధింపు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటనలో బాధితురాలి భర్తను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ కె. రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బావుసాయిపేట గ్రామానికి చెందిన గెంటె రేణుక ఆత్మహత్యపై కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. విచారణలో భర్త గెంటె ప్రశాంత్, అత్త, ఆడబిడ్డల అదనపు కట్న వేధింపుల కారణంగానే ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తేలింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన భర్త ప్రశాంత్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బి. రామ్మోహన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వేములవాడలో కబడ్డీ పండుగ

- క్యాంప్ ఫైర్‌లో మెరిసిన ప్రభుత్వ విప్
- క్రీడాకారులతో కలిసి చిందులేసిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు

వేములవాడ, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి): వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి బాల, బాలికల కబడ్డీ క్రీడోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన క్యాంప్ ఫైర్ వేడుకలు క్రీడాకారుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్యాంప్ ఫైర్‌ను ప్రారంభించారు. అనంతరం జానపద గీతాల మోతకు క్రీడాకారిణులు, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే స్వయంగా నృత్యం చేస్తూ మైదానాన్ని హుషారెత్తించారు. ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు సైతం అడుగులు వేయడంతో ప్రాంగణంలో పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని, క్రీడాకారులకు ఎల్లప్పుడూ తన అండదండలు ఉంటాయని తెలిపారు. ఈ వేడుకల్లో కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు







## ఉత్సాహపూరితంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

**వేములవాడ, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వేములవాడ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ మైదానాన్ని సందర్శించి, మ్యాచ్ల ప్రారంభానికి ముందు క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. పోటీల్లో పాల్గొంటున్న 68 జట్లకు చెందిన దాదాపు 1,300 మంది క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతి, భోజన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోయినేని కరుణాకర్, నాయకులు పులి రాంబాబు, ఇతర కాంగ్రెస్ నేతలు, నిర్వాహకులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన పుట్ట మధు

**ముత్తారం, సెప్టెంబర్ 4 (ప్రజా జ్యోతి):** మండలంలోని శుక్రవారంపేట (మచ్చుపేట పంచాయతీ)లో అబ్దుల్ రషీద్ కుమార్తె వివాహ వేడుకలకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మాజీ ఎంపీపీ అత్త చంద్రమౌళితో కలిసి వెళ్లిన ఆయన, వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి నూతన దంపతుల వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

## సీఈఐఆర్ ద్వారా పోయిన ఫోన్ రికవరీ

**కరీంనగర్ క్రైం, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** పోయిన మొబైల్ ఫోన్ను సీఈఐఆర్ టెక్నాలజీ ఆధారంగా కరీంనగర్ రూరల్ పోలీసులు గుర్తించి బాధితుడికి అప్పగించారు. కిసాన్నగర్కు చెందిన సిరిసిల్ల సాయి గణేష్ తన వివో ఫోన్ పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫోన్ వివరాలను సీఈఐఆర్ పోర్టల్లో నమోదు చేయగా, ఆ ఫోన్ మంచిర్యాల ప్రాంతంలో ఉన్నట్లు ఆచూకీ లభించింది. దీంతో ఫోన్ను స్వాధీనం చేసుకుని ఆదివారం రూరల్ సీఐ ఏ. నిరంజన్రెడ్డి సమక్షంలో బాధితుడికి అప్పగించారు. పోయిన ఫోన్లను గుర్తించడంలో సీఈఐఆర్ వ్యవస్థ ఎంతగానో దోహదపడుతుందని సీఐ తెలిపారు. ఫోన్ రికవరీలో ప్రతిభ చూపిన పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

# గురుకులాల్లో వసతుల లేమిపై ఎమ్మెల్సీ నిలదీత

- **పెద్దపల్లి బీసీ సంక్షేమ గురుకులాన్ని సందర్శించిన మల్క కొమురయ్య**
- **విద్యార్థులకు నాణ్యమైన భోజనం, తాగునీరు అందించాలని డిమాండ్**



**పెద్దపల్లి, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):** గురుకుల పాఠశాలల్లో చదువుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎమ్మెల్సీ, బీజేఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మల్క కొమురయ్య అన్నారు. ఆదివారం పెద్దపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు.

పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, భోజన నాణ్యత, తాగునీరు, పారిశుధ్య నిర్వహణపై ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను ఆరా తీశారు. గురుకులాల్లో నాణ్యమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, సరైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గురుకులాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు.

## జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు నిజామాబాద్ విద్యార్థిని వర్షిణి ఎంపిక

**కోనరావుపేట, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** కోనరావుపేట మండలం నిజామాబాద్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన ఎం. వర్షిణి (అండర్–16) జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో లాంగ్ జంప్ విభాగంలో బంగారు పతకం సాధించిన వర్షిణి.. ఈ నెల 16, 17, 19 తేదీల్లో హైదరాబాద్లోని ఎల్బీ స్టేడియంలో జరగనున్న జాతీయ స్థాయి



పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా వర్షిణిని సర్పంచ్ సింగం శ్రీహరి, ప్రధానోపాధ్యాయుడు పోతుగంటి శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం శాలువాతో సత్కరించి అభినందించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీస్తున్న పాఠశాల యాజమాన్యం కృషిని సర్పంచ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈర్ల పరిశరాములు, వంగపల్లి శ్రీనివాస్, మామిడిపల్లి శ్రీనివాస్, గుండా శ్రీకాంత్, ప్రశాంత్, ప్రణయ్, మహేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

# కొలనూరులో ఉచిత మెగా వైద్య శిబిరం





**కోనరావుపేట, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), సిరిసిల్ల అశ్విని హాస్పిటల్ సౌజన్యంతో, సర్పంచ్ జలగం అరవింద్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 150 మందికి పైగా గ్రామస్తులకు నిపుణులైన వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ చికోటి సంతోష్, డాక్టర్ జైల్ సింగ్, డాక్టర్ సాయి కుమార్, అశ్విని హాస్పిటల్ ఎండి డాక్టర్ అభినయ్ గోవర్ధన్ స్వామి, డాక్టర్ మాధవి, డాక్టర్ ప్రవీణ్ వర్మ తదితరులు పాల్గొని వైద్య సేవలు అందించారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన వైద్య బృందానికి, సర్పంచ్కు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

## గిరిజన సర్పంచుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్గా వినోద్ నాయక్

**కొడిమ్యాల, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** జగిత్యాల జిల్లా గిరిజన సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్గా కొడిమ్యాల మండలం గంగారం తండాకు చెందిన గుగులోత్ వినోద్ నాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. వినోద్ నాయక్ నియామకం పట్ల గంగారం తండావాసులు, కొడిమ్యాల మండల నాయకులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.





## ఎస్సీ గ్రూప్-3 రోస్టర్ పాయింట్ సవరించాలి: మాల సంఘాల డిమాండ్

- ఉస్మానియా యూనివర్సిటీ సదస్సుకు ఇల్లందకుంట నుంచి తరలివెళ్లిన మాల కులస్తులు
- సామాజిక న్యాయం, చట్టబద్ధ ప్రాతినిధ్యం కల్పించాలని పిలుపు




**ఇల్లందకుంట, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):** ఎస్సీ గ్రూప్-3 రోస్టర్ విధానాన్ని పునఃసమీక్షించి సవరించడంతో పాటు చట్టబద్ధమైన ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ కనుమల్ల సంపత్ ఆధ్వర్యంలో ఇల్లందకుంట నుంచి మాల కుల బాంధవులు పెద్ద ఎత్తున హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ గ్రూప్-3కు మొదటి రోస్టర్ పాయింట్‌ను 22వ స్థానంలో కేటాయించారని, అయితే ఇతర కులాలకు 20 లోపే పాయింట్లు ఇవ్వడం వల్ల మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రోస్టర్ పాయింట్లను సవరించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు కరీంనగర్ జిల్లా కార్యదర్శి భోగం చిరంజీవి, మాల ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్షుడు మేదరి నరేందర్, భోగం సాయిరాం, తాడెం దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

### సీపీఎం జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి



- ఈనెల 6న కలెక్టరేట్ ఎదుట వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా
- తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్

**కరీంనగర్, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితా నుంచి తొలగించిన అర్హుల ఓట్లను వెంటనే చేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ (ఎ×=) ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ ఈనెల 6న కలెక్టరేట్ ముందు నిర్వహించనున్న భారీ ధర్నాను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయని, సీఈసీ జ్ఞానేష్ కుమార్ నిబంధనలను తుంగలో తొక్కి అధికార బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా కోట్ల సంఖ్యలో బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలు, మేధావులు, అభ్యుదయ శక్తులు ఈనెల 6న జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొనాలని వాసుదేవ రెడ్డి కోరారు.

## ఎస్ఎస్‌సి కేబుల్ టీవీ ఆపరేటర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

**జమ్మికుంట, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక, మొగుళ్లపల్లి మండలాల ఎస్ ఎస్ సి సిటీ కేబుల్ టీవీ ఆపరేటర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కట్టంగూరి రామ్ స్వరన్ రెడ్డి, అధ్యక్షుడిగా చించు వీరేశం, కార్యదర్శిగా దూలం అంజయ్య గౌడ్, ఉపాధ్యక్షుడిగా కట్కూరి సునీల్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా ఓజ్జ శ్రీనివాస్, కోశాధికారిగా గొర్రె మహేందర్ ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఒద్ది రవీందర్, కలాల దామోదర్ రెడ్డి, వన్నె కుమార్, దూలం రాము ఎన్నికయ్యారు.



అనంతరం ఇల్లందకుంటలో సభ్యులు టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు వీరేశం, అంజయ్య గౌడ్ మాట్లాడుతూ.. డిజిటల్ యుగంలో సాంకేతిక సేవలు అందిస్తున్న కేబుల్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి యాజమాన్యాలు సహకరించాలని, అందరూ ఐక్యంగా ముందుకెళ్తామని తెలిపారు.

### శ్రీ తపాలా లక్ష్మీనరసింహ స్వామి ఆలయ నూతన కమిటీ ఎన్నిక

**తిమ్మాపూర్, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామంలోని శ్రీ తపాలా లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కేతిరెడ్డి సింగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అడిచెర్ల సత్యనారాయణ, కోశాధికారిగా మడుపు శ్రీనివాస్ రెడ్డి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో అడ్హక్ కమిటీ సభ్యులు పొన్నాల సంపత్, ఎడ్ల నారాయణ రెడ్డి, రాజిరెడ్డి, పోరండ్ల ఎల్లారెడ్డి, ఏంద్రా బాలరాజు, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, కుంట రాజేందర్ రెడ్డి, ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## హామీల అమలుపై స్పష్టం చేయాలి

### గట్టెపల్లి దీపక్



**తిమ్మాపూర్, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీఆర్ఎస్ 8వ డివిజన్ యువజన అధ్యక్షుడు గట్టెపల్లి దీపక్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను డిమాండ్ చేశారు. అలుగునూరులో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన 100 పడకల ఆసుపత్రిని ఎప్పుడు అందుబాటులోకి తెస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఇంకా 970 రోజుల సమయం ఉందని, మాటలు చెప్పడం కాకుండా అభివృద్ధి చేసి చూపించాలని పేర్కొన్నారు. ఆసుపత్రి నిర్మాణం, ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటామని, సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉందన్నారు.



## జాతీయ స్థాయిలో నిలవడం గర్వకారణం

### ఈర్ల పర్శరాములు

**కోనరావుపేట, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన మామిండ్ల వర్షిణి అండర్-16 అథ్లెటిక్స్ విభాగంలో జాతీయ స్థాయికి ఎంపిక కావడం గ్రామానికే గర్వకారణమని బీఆర్ఎస్ సీనియర్ నేత ఈర్ల పర్శరాములు అన్నారు. ఆదివారం వర్షిణి ఇంటికి వెళ్లిన ఆయన, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పర్శరాములు మాట్లాడుతూ.. మారుమూల గ్రామం నుంచి జాతీయ స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తెచ్చిందని, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వంగపల్లి శ్రీనివాస్, మామిడిపల్లి శ్రీనివాస్, గుండ శ్రీకాంత్, ప్రశాంత్, ప్రణయ్, మహేష్, మధు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

### పోనకల్‌లో ఘనంగా మెగా ఉచిత వైద్య శిబిరం

**మామిడపల్లి/పోనకల్, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** చంద న్యూరో మరియు ట్రామా కేర్ సెంటర్ సహకారంతో పోనకల్ సర్పంచ్ జక్కు సుప్ప భూమేష్ ఆధ్వర్యంలో స్థానిక స్లేట్ సీబీఎస్ఈ స్కూల్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో 29 గ్రామపంచాయతీల నుంచి తరలివచ్చిన 300 మంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, నరాల బలహీనత, వెన్నుముక, మెడ నొప్పులు, మధుమేహం, ఈసీజీ వంటి పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే వచ్చిన వారికి ఉచిత భోజన సదుపాయం కల్పించారు. ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించిన డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ లీలా శర్వాణి, డాక్టర్ స్వాతి, వారి సిబ్బందికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# కేసీఆర్ సీఎంగా మళ్లీ రావడమే ప్రజల ఆకాంక్ష

## పుట్ట మధూకర్

- ఎర్రవెల్లికి పాదయాత్ర చేసిన ముగ్గురు యువకులకు రాజగృహలో ఆత్మీయ సన్మానం
- తెలంగాణ సమాజం కేసీఆర్ నాయకత్వం కోసమే ఎదురుచూస్తోందన్న మంథని మాజీ ఎమ్మెల్యే





**మంథని, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):** రాష్ట్రంలోని సబ్బండ వర్గాలు కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలని, ఆయన పరిపాలన కోసమే ఎదురుచూస్తున్నాయని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ మంథనికి చెందిన ముగ్గురు యువకులు మంథని బెన్నిపాల్, బూర్ల వెంకటేశ్, కొండ వెంకటేశ్‌లు ఎర్రవెల్లి వరకు 200 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర పూర్తి చేశారు. తిరిగి మంథనికి చేరుకున్న యువకులను రాజగృహలో పుట్ట మధూకర్-శైలజ దంపతులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ఆశీర్వాదం పొందేందుకు యువకులు చేపట్టిన శ్రమకోర్చిన పాదయాత్ర ఎంతో అభినందనీయమన్నారు. దారిపొడవునా కలిసిన ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని యువకులు తెలపడం వారి అభిమానానికి అద్దం పడుతోందన్నారు. ఎర్రవెల్లిలో కేసీఆర్ స్వయంగా యువకులతో మాట్లాడి, భోజనం పెట్టి ఆత్మీయంగా మంథనికి పంపడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా కేసీఆర్ నాయకత్వమే మళ్లీ తెలంగాణకు శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు.





## బాధితులను పరామర్శించిన చల్మెడ లక్ష్మీనరసింహారావు

**కోనరావుపేట, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** కరీంనగర్‌లోని చల్మెడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలువురు బాధితులను బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆదివారం పరామర్శించారు. కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన తక్కలపల్లి భారతి, వెంకట్రావుపేటకు చెందిన రామస్వామి, కథలాపూర్ మండలం సిరికొండకు చెందిన పల్లికొండ రాజేష్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా, వారి ఆరోగ్య పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచిస్తూ, బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



## బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా విజయదేవి

**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** భారతీయ జనతా పార్టీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా గుగులోతు విజయదేవి నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు నేనావత్ రవి నాయక్, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేష్‌కు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా విజయదేవి మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలకు లోబడి గిరిజనుల సమస్యల పరిష్కారానికి, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని వెల్లడించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బీజేపీ బలోపేతానికి పనిచేస్తానని పేర్కొన్నారు.

# మంథని మైత్రి ఆటో యూనియన్ ఎన్నికల హోరాహోరీ

## అధ్యక్షుడిగా గడిపెల్లి శ్రీనివాస్ గెలుపు

- ప్రత్యర్థిపై 51 ఓట్ల మెజారిటీతో విజయం సాధించిన శ్రీనివాస్
- పట్టణంలో ఆటోలతో భారీ ర్యాలీ, సంబరాలు జరుపుకున్న సభ్యులు



**మంథని, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):** మంథని మైత్రి ఆటో యూనియన్ నూతన అధ్యక్షుడిగా గడిపెల్లి శ్రీనివాస్ విజయం సాధించారు. మైత్రి ఆటో యూనియన్ నిర్వహించిన పోలింగ్‌లో అధ్యక్ష పదవికి గడిపెల్లి శ్రీనివాస్, ఎజాజ్ పోటీ పడ్డారు. యూనియన్‌లోని మొత్తం 246 మంది సభ్యులు ఓటు హక్కు వినియోగించుకోగా, తన సమీప ప్రత్యర్థి ఎజాజ్‌పై గడిపెల్లి శ్రీనివాస్ 51 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గడిపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో గెలిపించిన ఆటో కార్మికులకు, సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మైత్రి ఆటో యూనియన్ సంక్షేమానికి, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల ఫలితాల అనంతరం మంథని బస్ డిపో నుంచి ప్రధాన అంబేద్కర్ చౌరస్తా మీదుగా పాత పెట్రోల్ పంప్ వరకు ఆటో డ్రైవర్లు భారీ ర్యాలీ నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మాజీ అధ్యక్షులు ఆర్లస్వామి, చల్లా నారాయణ, బొలిశెట్టి శంకర్, పెంటరి రాజు, పెంటరీ మొగిలితో పాటు పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

## గడిపెల్లి శ్రీనివాస్‌ను అభినందించిన పుట్ట మధూకర్

**మంథని, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** మంథని మైత్రీ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికైన గడిపెల్లి శ్రీనివాస్‌ను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అభినందించారు. పట్టణంలోని రాజగృహలో శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని సూచిస్తూ, యూనియన్‌కు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.



# గంగారం ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షుడిగా ఈద మధుకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మేడి దేవేందర్ గౌడ్ ఎంపిక
- నూతన పాలకమండలి సభ్యులను ఘనంగా సత్కరించిన ఉప సర్పంచ్, అర్చకులు



**పెద్దపల్లి, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని గంగారం గ్రామంలో గల ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా ఈద మధుకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మేడి దేవేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గుడ్ల నరేష్, ఉప కార్యదర్శిగా ఇమ్మడి లక్ష్మణ్, కోశాధికారిగా తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, ప్రచార కార్యదర్శిగా మేడి తిరుపతి గౌడ్ ఎన్నికయ్యారు. అలాగే ముఖ్య సలహాదారులుగా పాలకుర్తి పరశురాములు గౌడ్, గుడ్ల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా సుంకర సంపత్, మేడి అశోక్ గౌడ్, దాసరి శంకర్, సుంకరి కోమల, దాసరి కోమల, సుంకరి కట్టయ్య, ఇమ్మడి కృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఎన్నిక అనంతరం నూతన కమిటీ సభ్యులను ఉప సర్పంచ్ మేడి అశోక్ గౌడ్, ఆలయ అర్చకులు నిట్టూర్ అంబరీష్ శాలువాతో ఘనంగా సన్మానించారు. తమ ఎన్నికకు సహకరించిన గ్రామ పెద్దలకు, ప్రజలకు నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# మద్యం మత్తులో వ్యక్తిపై బీరు సీసాతో దాడి

- గ్రామాలలో బెల్ట్ షాపుల విచ్చలవిడి జోరు
- రేకొండ గ్రామంలో యువకుడి తల పగలగొట్టిన వ్యక్తి
- అధికారుల నిర్లక్ష్య వైఖరిపై గ్రామస్థుల ఆగ్రహం
- ఎక్సైజ్, పోలీస్ శాఖల పర్యవేక్షణ కరవు

**చిగురుమామిడి, అక్టోబర్ 04 (ప్రజాజ్యోతి):** బెల్ట్ షాప్‌లో మద్యం మత్తులో ఓ వ్యక్తిపై బీరు సీసాతో దాడికి పాల్పడిన ఘోర ఘటన చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. రేకొండ గ్రామంలోని ఒక బెల్ట్ షాప్ వద్ద శనివారం రాత్రి మద్యం మత్తులో వ్యక్తిగత కక్షల నేపథ్యంలో ఇదే గ్రామానికి చెందిన పంకెర్ల రాజు అనే వ్యక్తి బీరు సీసాతో దాడి చేయడంతో దాసరి సాగర్ రెడ్డి అనే యువకుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. తల పగిలి తీవ్ర రక్తస్రావం కావడంతో బాధితుడిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**గ్రామాల్లో బెల్ట్ షాపుల జోరు**

గాంధీ జయంతి (అక్టోబర్ 2) నాటి డ్రై డే రోజున కూడా గ్రామాల్లోని బెల్ట్ షాపులలో మద్యం జోరుగా విక్రయాలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గాంధీ జయంతి రోజున ప్రత్యేక నిఘా పెట్టాల్సిన పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు అటువైపు కనీసం కన్నెత్తి చూడలేదని స్థానికులు మండిపడుతున్నారు. గుడి, బడి అనే తేడా లేకుండా గ్రామాల్లో విచ్చలవిడిగా, వాటికి సమీపంలోనే మద్యం విక్రయాలు సాగుతున్నాయని వాపోతున్నారు.

**అధికారుల నిర్లక్ష్యంపై నిరసన**

బెల్ట్ షాప్‌ల నిర్మూలనపై ఎక్సైజ్ శాఖ అధికారులకు గ్రామస్థులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా, కనీసం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు



తీవ్రంగా వినిపిస్తున్నాయి. అధికారుల ఉదాసీనత వల్లే బెల్ట్ షాప్‌లు పెరిగిపోయి ఇటువంటి భౌతిక దాడుల వరకు దారితీస్తున్నాయని మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మొద్దునిద్ర వీడి మండలంలోని గ్రామాల్లో విస్తరించిన బెల్ట్ షాపులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని తక్షణమే మూసివేయించాలని మండల ప్రజలు గట్టిగా కోరుతున్నారు.

# రాయికల్ మార్కెట్ కమిటీకి కొత్త పాలకవర్గం

**రాయికల్, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** రాయికల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని తెలంగాణ ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు వ్యవసాయ, సహకార శాఖ శనివారం జీవో ఆర్‌టీ నంబర్ 652 జారీ చేసింది. నాలుగో పాలకవర్గానికి చైర్మన్ పదవిని ఓసీ జనరల్‌గా కేటాయించారు. ఈ కమిటీ చైర్మన్‌గా కొండపెల్లి రవీందర్‌రావు, వైస్ చైర్మన్‌గా గుజ్జుల మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ పాలకవర్గం రెండేళ్లపాటు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అమల్లో ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది



చైర్మన్



వైస్ చైర్మన్



# డాక్టర్ మల్లారెడ్డికి పరామర్శ

**రాయికల్, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** అనారోగ్యానికి గురైన గ్రామీణ వైద్యుల సంఘం సీనియర్ వైద్యుడు డాక్టర్ తీగుళ్ల మల్లారెడ్డిని ఆర్ఎంపి, ఎస్టీ యూనియన్ మాజీ మండల అధ్యక్షుడు ఈదుల లక్ష్మణ్‌కుమార్, మాజీ ప్రధాన కార్యదర్శి బోగ రాము ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ కాలంలో డాక్టర్ మల్లారెడ్డి చేసిన సేవలను, గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి ఆయన అందించిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఆర్ఎంపి, ఎస్టీ యూనియన్ ఎల్లప్పుడూ ఆయనకు అండగా ఉంటుందని, త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# ట్రస్మా మండల అధ్యక్షుడికి ఘన సన్మానం

**రాయికల్, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాయికల్ మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డిని రాయికల్ ప్రెస్ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్ జేఏసీ అధ్యక్షుడు చింతకుంట సాయికుమార్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి, విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అలాగే జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా చూడాలని కోరుతూ నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ జేఏసీ ప్రధాన కార్యదర్శి సింగిడి శంకరయ్య, కోశాధికారి కడకుంట్ల జగదీశ్వర్, ఉపాధ్యక్షుడు సింగని శ్యాంసుందర్, సహ కార్యదర్శి తిరుమల శంకర్, కార్యవర్గ సభ్యులు గోపి, భీమరాజు, శ్రీనివాస్, లింబాద్రి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



## శాంతిభద్రతల పరిరక్షణే ప్రథమ ప్రాధాన్యం: బుగ్గారం ఎస్సై ఎస్. శ్రీకాంత్



**బుగ్గారం, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని నూతన ఎస్సై ఎస్. శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం బుగ్గారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై జి. సతీష్ నిర్మల్ జిల్లాకు బదిలీ కావడంతో, గతంలో డీఎస్పీ, జగిత్యాల ఎస్పీలో విధులు నిర్వహించిన శ్రీకాంత్‌ను ఇక్కడికి నియమించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, బాధితులు నేరుగా వచ్చి సమస్యలు తెలుపవచ్చని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, డ్రగ్స్‌పై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని, నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.



## ప్లాస్టిక్‌కు దూరంగా.. ఆరోగ్యానికి చేరువగా

**ఆలయానికి 500 స్టీల్ ప్లేట్లు, గ్లాసుల వితరణ**

**బుగ్గారం, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో బుగ్గారం గ్రామానికి చెందిన ముద్దం వెంకటేష్--శశికళ దంపతులు స్థానిక శ్రీ ముత్యాల పోచమ్మ--నల్ల పోచమ్మ ఆలయానికి 500 స్టీల్ ప్లేట్లు, 500 స్టీల్ గ్లాసులను వితరణగా అందజేశారు. ఆలయంలో జరిగే అన్నదాన కార్యక్రమాల్లో భక్తుల వినియోగం కోసం వీటిని కమిటీ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి, ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతున్న తరుణంలో, స్టీల్ సామగ్రిని బహుకరించడం అభినందనీయమని కొనియాడారు. భక్తుల సౌకర్యార్థం సేవ చేయడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడిన దాతల సేవా దృక్పథాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## ఉత్సాహంగా కరీంనగర్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు

**ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్**

**కరీంనగర్, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు అత్యంత ఉత్సాహంగా, ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ విచ్చేసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సమాజంలో రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఈ ఎన్నికలు దోహదపడతాయని పేర్కొన్నారు.

# జాతి మరువలేని మహానేత జువ్వాడి రత్నాకర్ రావు

**కోరుట్ల, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేసిన మహానేత, మాజీ మంత్రి స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు అని తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగారావు కొనియాడారు. రత్నాకర్ రావు 99వ జయంతి సందర్భంగా కోరుట్లలోని ఆయన విగ్రహానికి డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్యతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సింగారావు మాట్లాడుతూ.. రత్నాకర్ రావు నిస్వార్థ రాజకీయానికి నిలువెత్తు నిదర్శనమని, కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధిలో ఆయన పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. అనంతరం ఆయన స్మారకార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# దమ్మన్నపేటకు నూతన విద్యుత్ సబ్‌స్టేషన్

## రూ.3.23 కోట్లు మంజూరు

- **టీజీఎన్‌పీడీసీఎల్ నుంచి పరిపాలనా, సాంకేతిక అనుమతులు విడుదల**
- **తీరనున్న లో-వోల్టేజ్ సమస్యలు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ప్రజల కృతజ్ఞతలు**

**మేడిపల్లి, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం దమ్మన్నపేటలో రూ. 3.23 కోట్ల అంచనా వ్యయంతో నూతన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి టీజీఎన్‌పీడీసీఎల్ పరిపాలనా, సాంకేతిక అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలో పెరుగుతున్న గృహ, వ్యవసాయ విద్యుత్ డిమాండ్‌కు తోడు సుదీర్ఘ ఫీడర్ల వల్ల తరచూ ఏర్పడుతున్న అంతరాయాలను నివారించేందుకు ఈ కొత్త సబ్‌స్టేషన్‌ను మంజూరు చేశారు. ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే లోడ్ విభజన జరిగి, విద్యుత్ సరఫరా సామర్థ్యం పెరగడమే కాకుండా వేసవిలో ఎదురయ్యే లో-వోల్టేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. సబ్‌స్టేషన్ మంజూరుకు ప్రత్యేక చొరవ చూపిన రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కలకు స్థానిక నాయకులు, రైతులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



NORTHERN POWER DISTRIBUTION COMPANY OF TELANGANA LIMITED
CORPORATE OFFICE : WARANGAL

ABSTRACT

TGNPDCL/WGL – Proposal for erection of 33/11KV Substation at **Dammannapet (V)** in Medipally (M) of Metpally Division of Operation Circle Jagitial - Administrative Approval and Technical Sanction under T&D – Orders issued.

**N.O.O (CE/Projects) Ms.No.604** **Dt.03.10.2026.**

Read the following: -

(1) N.O.O. Cs Ms.No.461, Dt: 07.01.2013.

ORDER :

1. It is reported from the field that the consumers of Dammannapet are getting more number of interruptions due to lengthy loaded feeders because of increasing in loads, day to day demand and loads are increasing day by day.
2. In view of the above, it is proposed for erection of 33/11KV Substation at Dammannapet (V) in Medipally (M) of Metpally Division of Operation Circle Jagitial with a provision of 1x5.0MVA Power transformer and 5 **Nos.** 11KV feeders namely Dammannapet Town, Rural-1, Rural-2, Machapur AGL and Thakkallapally AGL feeders and 1 No. Interlinking line.
3. After careful consideration, TGNPDCL accords administrative approval and technical Sanction for the above proposal for erection of 33/11KV Substation at Dammannapet (V) in Medipally (M) of Metpally Division of Operation Circle Jagitial for an amount of **Rs.3,23,66,000/-** (Rupees Three Crores Twenty Three Lakhs Sixty Six only).
4. The proposal envisages the following:

| Sl. No. | Name of the proposed 33/11KV Substation | Mandal | Constituency/ Division/ Circle/ District | Sub station (Nos.) | Proposed 33KV line (KM) (In & Out) | Proposed 11 KV line (KM) | Switch yard and civil (Rs. In Lakhs) | 33KV line (Rs. in Lakhs) | 11KV line (Rs. in Lakhs) | Cost of the Substation (Rs.in Lakhs) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | Dammannapet | Medipally | Vemulawada/ Metpally/ Jagitial/ Jagitial | 1 | 6.00 | 6.50 | 210.00 | 68.67 | 44.99 | 323.66 |
| | | | | | | | | | Total | 323.66 |

Contd.

AnyScanner

: 2 :

5. The expenditure is chargeable to T&D/S.I Account.
6. This order issued with the concurrence of Director/Finance/TGNPDCL.

# ఘనంగా జువ్వాడి రత్నాకర్ రావు జయంతోత్సవాలు

**కోరుట్ల, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, దివంగత నేత జువ్వాడి రత్నాకర్ రావు జయంతోత్సవాలను కోరుట్లలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రజా దండోర దినపత్రిక ఎడిటర్ డా. పేట భాస్కర్, జువ్వాడి తనయుడు జువ్వాడి కృష్ణారావుతో కలిసి రత్నాకర్ రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా. పేట భాస్కర్ మాట్లాడుతూ.. రత్నాకర్ రావు చేసిన ప్రజాసేవ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావు, డీసీసీ అధ్యక్షుడు నందయ్య, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, జువ్వాడి అభిమానులు పాల్గొన్నారు.



# క్రీడలతో శారీరక, మానసిక వికాసం

**రాయికల్, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** క్రీడలు విద్యార్థులు, యువతలో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని పలువురు వక్తలు అన్నారు. రాయికల్‌లో నిర్వహించిన లోకల్ టోర్నీ సీజన్--6 క్రికెట్ పోటీల ఫైనల్ మ్యాచ్ ఆదివారం ఉత్కంఠభరితంగా సాగింది. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో వక్తలు మాట్లాడుతూ.. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఐక్యత అలవడుతాయని, గెలుపోటములను సమానంగా స్వీకరించి జీవితంలో ముందడుగు వేయవచ్చని పేర్కొన్నారు. టోర్నీలో విజేతగా నిలిచిన 'టైగర్ 11' జట్టుకు రూ. 20,000 నగదు బహుమతిని ప్రగతి హైస్కూల్



కరస్పాండెంట్ బాలె శేఖర్, రన్నరప్ 'హరీష్ మాస్టర్' జట్టుకు రూ. 10,000 నగదు బహుమతిని కౌన్సిలర్ బత్తిని మహేశ్వరి నాగరాజు అందజేశారు. విజేతలకు, క్రీడాకారులకు ట్రోఫీలను విస్డం హైస్కూల్ కరస్పాండెంట్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి స్పాన్సర్ చేసి బహుకరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సాదే భీమ్ రెడ్డి, బత్తిని భూమయ్య, బాలె నిఖిల్ కుమార్, క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హాస్పిటల్‌లో ఘనంగా శ్రీరామ హృదయ కలశ యాత్ర

**రాయికల్, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** రాయికల్ పట్టణంలోని విజయ హాస్పిటల్‌లో డాక్టర్ జగన్ మోహన్ రావు - విజయ దంపతులు, మాజీ జడ్పీటీసీ గండ్ర అచ్యుత రావు - ఎక్స్ మున్సిపల్ వైస్ చైర్మన్ రమాదేవి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామివారి సప్తతి తిరునక్షత్ర శ్రీరామ హృదయ కలశ యాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, ధర్మబద్ధమైన కోరికలు నెరవేరాలని, లోక కళ్యాణం కోసం కొనసాగుతున్న ఈ కలశ యాత్ర తమ హాస్పిటల్‌కు రావడం పూర్వజన్మ



సుకృతమని తెలిపారు. అనంతరం అర్చకులు మరింగంటి రామకృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో 'శ్రీరామ' నామస్మరణతో కలశంలో అక్షింతలు వేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి బాధ్యులు వేల్పుల స్వామి యాదవ్, బోద్గం శైలేందర్ రెడ్డి, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా జేరిపోతుల మహేందర్

- రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు
- అంబేద్కర్ ఆశయాల సాధనకు నిరంతరం కృషి చేస్తానని వెల్లడి

**కరీంనగర్, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):** ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా న్యాయవాది జేరిపోతుల మహేందర్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకురి మధు చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు.




డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. రెండోసారి బాధ్యతలు స్వీకరించిన జేరిపోతుల మహేందర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మళ్లీ అవకాశం కల్పించిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ, అంబేద్కర్ ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వంతడుపుల సంపత్, కంపెల్లి సతీష్, కాల్వల రామచంద్రం, సాంబార్ కొమురయ్య, చుంచు లత శ్రీ, బూత్కూరు కాంత, వంతడుపుల బాబు తదితరులు పాల్గొన్నారు.



## అండర్‌పాస్ కోసం జాతీయ రహదారిపై ఆందోళన

**--- కొత్తగట్టు--గొల్లపల్లి గ్రామాల ప్రజల నిరసనతో నిలిచిన వాహనాలు**

**శంకరపట్నం, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):** కొత్తగట్టు--గొల్లపల్లి గ్రామాల మధ్య అండర్‌పాస్ నిర్మించాలని కోరుతూ ఆదివారం శంకరపట్నం మండలం కొత్తగట్టు వద్ద జాతీయ రహదారి టోల్‌గేట్ సమీపంలో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. రహదారి దాటే క్రమంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా స్పందించకపోవడంతో నిరసన చేపట్టామని తెలిపారు. ధర్నా కారణంగా రహదారిపై ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న సీఐలు శ్రీనివాస్, కర్ణాకర్, ఎస్ఐ శేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని నిరసనకారులతో చర్చలు జరిపారు. అయితే, అండర్‌పాస్ నిర్మాణంపై స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చిచెప్పడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ కార్యక్రమంలో సర్పంచులు మాడ సుజాత, సాగి విద్యాసాగర్ రావు, దేవస్థాన చైర్మన్ ఉప్పుగల్లు మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ మెంతుల సరోజన, మాజీ చైర్మన్లు రాజిరెడ్డి, తూముల శ్యాంరావు, ఉపసర్పంచ్ వీరేందర్ కుమార్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబేద్కర్ సంఘం ఎన్నిక రద్దు

**--- జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్**

**కరీంనగర్, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** కరీంనగర్ కార్పొరేషన్ రెండో డివిజన్ తీగలగుట్టపల్లిలోని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని రద్దు చేస్తున్నట్లు తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కమిటీ తమను బీఆర్ఎస్ ప్యానెల్‌గా ప్రచారం చేసుకుంటూ రాజకీయ నాయకులను కలవడం, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం సంఘ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. కుల సంఘం ఎన్నికలతో ఏ రాజకీయ పార్టీకీ సంబంధం లేకపోయినా.. బిజెపిపై తమ ప్యానెల్ గెలిచిందని ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. ఈ అంశంపై విచారణ జరిపి వివరణ కోరగా, నూతన కమిటీ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు కమిటీని పూర్తిగా రద్దు చేసినట్లు జిల్లా అధ్యక్షుడు వివరించారు.